
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్ రాజు





## - 193 -
# నట పిశాచి కథ

సినిమా వాళ్ళు.....

వాళ్ళలో ఏదో మాయ ఉంది.

ఎందుకో, ఏమిటో తెలీదు కానీ అటు అమలాపురంలో ఆటో వాడి నుంచి ఇటు అమెరికాలో టెస్లా ఎలెక్ట్రిక్ కారు తోలుకునే మిలయనీర్ల దాకా సినిమా వాళ్ళు అనగానే అదో వేలం వెర్రి. ఏ దీపికా పదుకొనె లాగానో, పూజా హెగ్డె లాగానో, ఆఖరికి పేరు, ఊరూ తెలియని ఏ హీరోయిన్ అయినా సరే.... అందచందాలు వొలకబోస్తూ వగలు బోతారు కాబట్టి అందరూ సెల్ఫీల కోసం ఎగబడితే అర్థం చేసుకోగలను కానీ....కొంత మంది నటులది మటుకు వక్రబుద్ధి. అలాంటి నటులతో ఏదైనా కార్యక్రమం నిర్వహించవలసినప్పుడు ఎవరికైనా కోపం నషాళానికి అంటుతుంది. ఈ 'నషాళం అంటడం" అంటే ఏమిటో ఈ రోజుల్లో పాఠకులకి తెలియక పోవచ్చు. ఉదాహరణకి మా అమెరికా అల్లుడికీ, ఈనాటి యువతరానికీ కొత్తవకాయ తినగానే కారం నషాళానికి అంటుతుంది. కాకినాడలో మా ఇంటి ఎదురుగా ఉండే బాషా బజ్జీ రోడ్ బండి వాడి మిరప కాయ బజ్జీ నోట్లో పెట్టుకోగానే డిటో!. ఇక జగన్ కి చంద్రబాబుని చూసినా, చంద్రబాబు జగన్ ని తల్చుకున్నా మొత్తం ఆంధ్రా ఓటర్లకి నషాళం అంటుతుంది. కానీ ఈ ఆవకాయ, బజ్జీ నషాళాలు కేవలం కారం వలన వచ్చే కన్నీళ్ళ బాపతు. కాస్త మంచి నీళ్ళు తాగేస్తే చాలు. ఉపశమనం కలుగుతుంది. అసలు నషాళం అంటే అర్థం మెదడు. మెదడు దాకా వెళ్ళి అంటుకునేటంత చికాకు, కోపం నాకు సాధారణంగా రావు. కానీ ఈ మధ్య ఆ అనుభవం కూడా అయింది. ఇటీవల ఒక నటుడితో జరిగిన చిన్న అనుభవంలో నాకు కోపం నషాళానికి అంటి, ఒళ్ళు మండిన మాట వాస్తవం. ఈ నటుడికి కోట్లాది ధనం, కీర్తి, బిరుదులు, అసంఖ్యాకమైన అభిమానులు, పైగా కాస్తో, కూస్తో పాండిత్యం ఇవన్నీ ఉన్నా, పిల్లికి కూడా బిచ్చం పెట్టని పిసినారి అయినా...ఇవన్నీ వ్యక్తిగతాలు. వాటి వలన మనకి ఇబ్బంది లేదు. కానీ

మానసికంగా ఉన్న చిన్న తరహా పైశాచికానందం.. అనగా తనని ఆహ్వానించి గౌరవించే వారిని నానా తిప్పలూ పెట్టడానికి ప్రయత్నించడం సహించదగ్గది కాదు. అసలు సిసలు దెయ్యాలు, పిశాచాలు ఎలా పీక్కు తింటాయో తెలీదు కానీ ఈ సినీ నటుడు నిర్వాహకులని పీక్కు తింటాడు. సినిమా నటులకి “నట సమ్రాట్”, “నట రత్న”, “నట కిరీటి” లాంటి బిరుదులు పరిపాటి. ఈ నటుడికి తగిన బిరుదు “నట పిశాచి”. ఇదంతా నాకు చాలా ఏళ్ళగానే తెలుసు.

దానికి ఒక ఉదాహరణ....ఒకసారి ఆ మహానుభావుడిని మా అమెరికా మహాసభల వారు

“మీకు జీవన సాఫల్య పురస్కారం ఇస్తాం. మా మహాసభలకి మీరు రావాలి” అని ఆహ్వానించారు.

“ఓ దానికేముంది. తప్పకుండా వస్తాను. కానీ మా మేనేజర్ ఆస్ట్రేలియా వెళ్ళాడు. నాలుగు రోజుల్లో వస్తాడు. అప్పుడు పిలవండి. నా షూటింగ్ షెడ్యూల్ చూసి చెప్తాను.” అన్నాడు అలవోకగా ఆ నట పిశాచి.

తన షూటింగ్ తేదీలు జాగ్రత్తగా రాసి పెట్టుకునే పెద్ద కేలెండర్ ఎదురుగుండా గోడ మీద ఖాళీగా విల విల లాడుతోంది. పక్కనే ఉన్న మేనేజర్ తను ఆస్ట్రేలియా ఎప్పుడు వెళ్ళానా అని చేతులు గిల్లుకున్నాడు, ‘వాళ్ళు పిలవగానే ఒప్పేసుకుంటే మనకి వేరే పనేమీ లేదు అనుకుంటారు మేనేజరూ...నాలుగు సార్లు పిలిపించుకోవాలి”..అదోలా నవ్వాడు షూటింగులు తగ్గిపోయిన న.పి. “మేకప్ లో ఉన్నాను” “పెళ్ళి శోభనానికి చీఫ్ గెస్ట్ గా పిలిచారు, బిజీగా ఉన్నాను.”. “ఎల్లుండి మీ రాత్రి 3:30 కి పిలవండి, అప్పుడు మా మధ్యాహ్నం కదా, నాకు కుదురుతుంది” అనీ పరిపరి విధాలుగా వంకలు చెప్పి పిలిపించుకుని, బులిపించుకున్నాడు న.పి. నాకు తెలియక అడుగుతానూ, బుద్ధి ఉన్నవాళ్ళు ఎవరైనా సరే, శోభనానికి ఒక సినిమా నటుడిని ఆహ్వానిస్తారా? ఇక మరీ బెట్టు చేస్తే తన బదులు, తనలాగే ఖాళీగా ఉన్న మరొక నట భూతాన్నో, నట దెయ్యాన్నో ఈ అమెరికా వాళ్ళు పిలిచిపారేస్తారేమో అని కించిత్తు భయపడి, మొత్తానికి

“నిజానికి నా పారితోషికం ఇరవై వేల డాలర్లు. మీరు కాబట్టి పదిహేను వేలకి తగ్గిస్తాను. అంతా కేష్ రూపంలో సగం హైదరాబాద్ లో ఇవ్వాలి. సగం అమెరికాలో అడుగుపెట్టగానే ఎయిర్ పోర్ట్ లోనే ఇవ్వాలి. ఇక నాకు రానూ పోనూ బిజినెస్ క్లాస్ విమానం టికెట్టూ, నాతో వచ్చి నా పెట్టెలు మోసే చెంచా గాడికి మామూలు టికెట్టూ, అక్కడ అమెరికా ఐదు నక్షత్రాల విఐపి హొటెల్ లో రెండు గదులు, మూడు టాయ్ లెట్లు ఉండే పెద్ద విఐపి గది కావాలి. అన్నట్టు నేను నా గదిలోనే కూచుంటాను. మీరు పురస్కారం సమయానికి నన్ను గౌరవంగా వేదిక మీదకి తీసుకెళ్ళాలి. అంతే కానీ నేను పబ్లిక్ లోకి రాను. అడ్డమైన వాడూ నా గదిలోకి రావడం, సెల్ఫీలు తీసుకోవడం కుదరదు. నేను అక్కడ ఉన్నన్ని రోజులూ నాతో మీ నిర్వాహకులలో ఒకరు తోడుగా ఉండి ఎక్కడికైనా వెళ్ళాలన్నా, ఏమైనా కావాలన్నా ఏర్పాటు చెయ్యాలి.

మీరు సత్కారం చెయ్యడం, నేను దానికి స్పందించడం..అంతే మన కాంట్రాక్ట్ "....ఇలా తన షరతులు అన్నీ ఏకరువు పెట్టాడు.

ఆ నిర్వాహకులు ముందు లబో, దిబో మన్నా...వాళ్ళు కూడా ముదురులే కాబట్టి "ముందు ఇక్కడికి రానీ, అప్పుడు చూసుకుందాం" అనుకుని అన్నింటికీ ఒప్పేసుకున్నారు.

అలా ఒప్పుకోడానికి అసలు కారణం ఇద్దరికీ తెలుసు. ఈ పాప్యులర్ నటుడు వస్తున్నాడూ అతని ఫొటోలు అన్ని చోట్లా వేసి అని టం టాం ప్రచారం చేస్తే మరొక వెయ్యి మంది వందల కొద్దీ డాలర్లు కట్టి ఆ మహా సభలకి వస్తారు కదా, మనకి కిట్టుబాటు అవుతుంది అని నిర్వాహకులూ,

"నా పేరు చెప్తే వీళ్ళకి టికెట్లు అమ్ముడయి లక్ష డాలర్లు వస్తాయి కదా. అందులో నా షేర్ పదిహేను శాతం ప్లస్ ఖర్చులు..అంతే కదా నేను అడిగినదీ" అని న.పి గారి లెక్కలు.

అమెరికాలో మన కల్చరల్ సంఘాలు అన్నింటిలోనూ ఈ కమర్షియల్ ఎక్కువ, కల్చర్ తక్కువా అయిపోయాయి. ఆ ఉన్న కొద్దిపాటి కల్చర్ అయినా కేవలం సినిమా బాపతు అయితేనే నిర్వాహకుల పరిభాషలో "జనాలకి ఎక్కుతుంది". అంచేత ఖర్చులు పెట్టి ఎవరిని ఇండియా నుంచి ఆహ్వానించినా 'కిడుతుందా, లేదా?" అని ఈ కమర్షియల్ లెక్కలు జాగ్రత్తగా వేసుకుంటారు. ఈ నట పిశాచి విషయంలో లెక్కలు అటూ, ఇటూ సరిపోవడంతో అన్ని ఏర్పాట్లూ జరిగి అమెరికాలో మహాసభలకి రెండు రోజుల ముందు ఆయన అమెరికాలో అడుగుపెట్టాడు.

ఆయన్ని కొంత మంది నిర్వాహకులు ఆర్భాటంగా విమానాశ్రయంలో ఆహ్వానం పలికి ఐదు నక్షత్రాల హొటెల్ కి తీసుకెళ్ళారు. వెళ్ళగానే "నేను ఇండియా మా ఫేమిలీకి ఫోన్ చేసి క్షేమంగా చేరినట్టు చెప్పాలి. నాకో సెల్ ఫోన్ ఏర్పాటు చేస్తారా?" అని కూడా వచ్చిన ఆ సంస్థ అధ్యక్షుడిని అడగగానే ఆ మానవుడు బిత్తర పోయాడు. ఎందుకంటే ఆ నట పిశాచి జేబులో ఫోన్ ఉండనే ఉంది.

ఆ మాటే మర్యాదగా అనగానే "ఇక్కడ దిగినప్పటినించీ నా ఫోన్ ఖర్చులు కూడా మీవే కదా. ఇండియా వెనక్కి వెళ్ళేదాకా నా ఫోన్ వాడను." ఇది నట పిశాచి పీడనలో మొదటి అస్త్రం. పాపం, అప్పటికప్పుడు సదరు సంఘం అధ్యక్షుల వారు తంటాలు పడి న.పి. గారికి ఒక సెల్ ఫోన్ కొనిపెట్టాల్సి వచ్చింది.

ఇక మొదటి రోజు రాత్రి రెండు గంటలకి న.పి. గారు సదరు సంఘం అధ్యక్షుల వారికి తన కొత్త ఫోన్ నుంచి పిలిచి "ఏమిటి, పడుకున్నారా?" అని ఆప్యాయంగా పలకరించగానే అధ్యక్షుల వారు "ఇంతటి గొప్ప పాప్యులర్

నటుడు తనని అర్ధరాత్రి ఇంత ఆప్యాయంగా పలకరించాడు" కదా అని తబ్బిబ్బు పడిపోయి "లేదు లేనే లేదు న.పి. గారూ...మహాసభల పనులు చూసుకుంటున్నాను" అని నిద్రలోనే పలవరించాడు. "నేనూ అదే అనుకున్నాను లెండి. నాకైతే జెట్ లాగ్ కదా..నిద్ర పట్టడం లేదు. పైగా ఆకలి వేస్తోంది. ఓ నాలుగు ఇడ్లీలు పంపగలరా? చెట్నీ లేకపోయినా పరవాలేదు, ఆవకాయతో సద్దుకుంటాను"...అంతే ఆప్యాయంగా అడిగాడు న.పి. "ఇప్పుడా? ఇడ్లీలా?" తకీమని లేచి కూచున్నారు అధ్యక్షుల వారు. ఆ గండం అధ్యక్షుల వారు ఎలా గట్టెక్కారో నాకు తెలియదు కానీ తర్వాత కాశీ వెళ్ళినప్పుడు గంగలో ఇడ్లీలు వదిలేసినట్టు నా దగ్గర సమాచారం ఉంది.

ఇక రెండో రోజు రాత్రి ఎందుకైనా మంచిది అని ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని పడుకున్నారు సదరు అధ్యక్షుల వారు. కానీ మళ్ళీ రాత్రి రెండు గంటలకి ఉపాధ్యక్షుల వారి సెల్ ఫోన్ గణగణా మోగింది. ఇంతకీ ఆ ఉపాధ్యక్షుల వారు ఎవరో కాదు. నేనే!.

"హలో న.పి గారూ, ఏమిటి, ఇంకా నిద్రపోలేదా?" – ఆ గొంతు నాకు తెలిసినదే.

"ఎలా నిద్ర పడుతుంది, రాజు గారూ. రేపు మీ మహాసభలో నాకు సత్కారం కదా. వేసుకోడానికి ఇండియా నుంచి తెచ్చుకున్న సూటూ, చొక్కా అన్నీ ప్రయాణంలో నలిగిపోయాయి మరి. ఇప్పుడు ఎవరైనా ఇస్త్రీ చేసే వాళ్ళని పంపగలరా?" న.పి. గారి నిర్వాహక పీడన పైశాచిక హింసానందంలో మరొక అస్త్రం. గత రెండు రోజులుగా ఈ న.పి. మమ్మల్ని పెడుతున్న హింసలకి అప్పటికే విసుగెత్తి పోయిన నేను "ఇప్పుడు అమెరికాలో ఇస్త్రీ దుకాణాలు మూసేసి ఉంటాయి. నాకేమో ఇస్త్రీ చెయ్యడం రాదు. కానీ ఓ పని చేద్దాం. మీరు ఆ బట్టలు రెడీ చెయ్యండి. నేను మీ గదికి ఇప్పుడే వస్తాను. ఆ బట్టలు అక్కడ కార్పెట్ మీద పరిచి వాటి మీద నాలుగు సార్లు దొర్లితే అవి ఇస్త్రీ చేసినట్టే కదా. మీరు దొర్లడానికి ఇబ్బంది లేకుండా నేను ఒక చెయ్యి వేస్తాను" అన్నాను.

ఈ గండం అలా గడిచింది. అనగా ఆయన తకీమని ఫోన్ పెట్టెయ్యడం. నేను మరో రెండేళ్ళు ఏమీ పెట్టుకోక పోయినా ఏమీ జరగనట్టు ఆయనతో స్నేహం కొనసాగించడం జరుగుతూనే ఉంది.

ఇదంతా ఇప్పుడు ఎందుకు జ్ఞాపకం వచ్చిందీ అంటే.....

క్రిందటి నెల మార్చ్ 9-10, 2024 తేదీలలో కాకినాడ మహానగరంలో దంటు కళాక్షేత్ర ప్రాంగణంలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు ప్రకటన విడుదల చెయ్యగానే "న.పి. గారు మీతో ఏదో మాట్లాడాలిట.

పిలవమన్నారు." అని కబురు రాగానే ఆయనకి ఫోన్ చేశాను. అప్పుడు హైదరాబాద్ లోనే ఉన్నాను కాబట్టి మర్నాడు ఆయన ఇంటికి వెళ్ళాను.

"కాకినాడ సదస్సుకి నేను వచ్చి తీరతాను" అని చెప్పి మేము అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాక, పాతిక వేలు ఖర్చు పెట్టాక, నా మీద లేనిపోని కోపం తెచ్చుకుని ఆఖరి క్షణంలో "నాకు షూటింగ్ ఉంది" అని రావడం మానుకున్న ఆ "నట పిశాచి" ని తల్చుకుంటే జాలి వేస్తుంది. కోపం రాదు. తెర మీద చూస్తే నవ్వూ వస్తుంది. .

ఈ చిన్న అనుభవంలో నాకు కోపం నషాళానికి అంటి, ఒళ్ళు మండిన మాట వాస్తవం. ఆ మంట చల్లారడం అంటే ఎలా? ఇలా అనమాట!.

**COMMENTS**